ఉచితం సరే.. బస్సులేవీ?

- పల్లెకు రాని ఆర్టీసీ బస్సులు
- బస్సు ఎక్కాలంటే నడవాల్సిందే
- గ్రామాలకు బస్సులు వేయాలని కోరుతున్న ప్రజలు


బస్సుల కోసం ధర్నా చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)


రాయికల్ పాత బస్టాండ్‌లో బస్సు

రాయికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. కానీ పల్లెలకు సరిపడా బస్సులు మాత్రం లేవు. మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఆర్టీసీ చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే పల్లె వెలుగు బస్సు సేవలు గ్రామాల్లో అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ఆదాయం రావడం లేదని బస్సు సర్వీసులు రద్దు చేస్తుండటం, నూతన గ్రామ పంచాయతీలకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో పల్లెల్లో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో లేదా కాలినడకన గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మండలంలోని చెర్లకొండాపూర్, వస్తాపూర్, కుర్మపల్లి, శ్రీరాంనగర్, కైరిగూడెం గ్రామాలకు పూర్తిగా బస్సు సౌకర్యం లేదు. ఆలూరు, వీరాపూర్, రాజనగర్ వంటి గ్రామాలకు మండల కేంద్రానికి వెళ్లేందుకు బస్సులు లేవు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

తమ గ్రామాలకు తారురోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ప్రైవేటు వాహన నిర్వాహకులు జనం నిండేవరకు తీయరు. ఒకవేళ తీసినా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదకరంగా నడపడంతో పాటు అధిక ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికుల నడ్డివిరుస్తున్నారు.

ఎక్కాలంటే నడవాల్సిందే!

మండలంలోని చెర్లకొండాపూర్, కుర్మపల్లి, వస్తాపూర్, కైరిగూడెం, శ్రీరాంనగర్ గ్రామాలకు చెందిన ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కాలినడకన సుమారు రెండు నుంచి మూడు కి.మీ దూరంలోని ప్రధాన రహదారికి రావాల్సిందే. మైతాపూర్ గ్రామస్తులు తమ గ్రామ శివారు నుంచి కాకుండా కోరుట్ల డిపో బస్సులు గ్రామం లోపలి నుంచి నడపాలని కోరుతూ ఇటీవల ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిపై వెళ్లే బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే నిరీక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో రవాణా సేవలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రయాణాలకు ప్రాధాన్యం ఇచ్చి సహకరించాల్సిన ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించకుండా గ్రామీణ ప్రయాణికులకు అవస్థలు తెచ్చి పెడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, నూతన ప్రభుత్వం ప్రతీ గ్రామానికి పల్లెవెలుగు బస్సు సర్వీసులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాలేజీకి వెళ్లాలంటే ఆటోలో దిక్కు



మాది రాయికల్ మండలం తాట్లవాయి. నేను రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. మా ఊరి నుంచి రాయికల్‌కు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతి రోజూ 15 కిలోమీటర్లు ఆటోలో రావాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ నుంచి మా గ్రామానికి బస్సు నడిపించాలి.

– రవళి, తాట్లవాయి

బస్సుల కోసం ధర్నా చేశాం



ఆర్టీసీ బస్సులు మా గ్రామంలో నుంచి వెళ్లే విధంగా చూడాలని కోరుతూ పలుమార్లు గ్రామస్తులంతా కలిసి ధర్నా చేశాం. అయినప్పటికీ వెళ్లడం లేదు . మా గ్రామస్తులం బస్సు ఎక్కాలంటే సుమారు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి పూట మహిళలు భయాందోళన గురవుతున్నారు.

– మోత్కూరు శ్రీనివాస్, మైతాపూర్

సేవ చేసి రుణం తీర్చుకుంటా

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

కొండగట్టు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనా అనంతరం మేడిపెల్లి సత్యం మొదటి సారిగా నియోజకవర్గానికి ఆదివారం వచ్చారు. కొడిమ్యాల,నాచుపెల్లిలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నాడు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్, ఆదిరెడ్డి, చిలువేరి నారాయణ, అంజయ్య, ముత్యం శంకర్‌గౌడ్, గాజుల అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

కొండగట్టులో ఎమ్మెల్యే పూజలు

కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ముందుగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేయగా, అధికారులు శాలువతో సత్కారించారు. సత్యం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో కొండగట్టు ఆలయం నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి చేస్తామన్నారు. నామినేషన్‌కు ముందు స్వామికి కట్టిన ముడుపు మొక్కు చెల్లించారు.

వలస జీవికి పెద్ద కష్టం


సౌదీలో అనారోగ్యానికి గురైన రాజుగౌడ్

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన గొట్టిపడ్డ రాజుగౌడ్ అనే వ్యక్తి ఏడాదిన్నర క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశం సౌదీ వెళ్లాడు. వెళ్లిన కొద్ది నెలల్లోనే అనారోగ్యం పాలవడంతో పాటు పక్షవాతం వచ్చి ఒక చేతు, ఒక కాలు పడిపోయాయని అక్కడి మిత్రులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కాగా అనారోగ్యానికి గురైన రాజు ఆరోగ్యం మెరుగుపడేందుకు కుటుంబీకులు ఇప్పటివరకు రూ. 5 లక్షలకు పైగా వెచ్చించారు. ఇండియాకు తీసుకువచ్చేందుకు మరో రూ.3 లక్షలు కావాల్సి ఉంది. ఇప్పటికే ఆరోగ్యం కుదుటపడేందుకు అప్పు చేశామని, ఎవరైనా దాతలు స్పందించి ఆపన్నహస్తం అందిస్తే రాజు ఇండియాకు వస్తాడని కుటుంబీకులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సాయం చేయాలని వేడుకున్నారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అభినందనల వెల్లువ



మేడిపల్లి: ఎమ్మెల్యే గా ప్రమాణ స్వీకారం చేసిన మొట్టమొదటిసారిగా వేములవాడ విచ్చేసిన ఆది శ్రీనివాస్ మేడిపల్లి, బీమారం మండలాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు సాయిగౌడ్, గంగారెడ్డి,లింగం,రాజుకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్నూరు కాపు యువత

మేడిపల్లి, బీమారం మండలాల మున్నూరు కాపు యువకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల యువత అధ్యక్షుడు లక్ష్మీపతి, చందా రమేశ్, పుప్పాల రాంరెడ్డి, భర్కం శేఖర్, బొమ్మెన ప్రశాంత్, వినయ్ సంజీవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బీసీ నాయకుల సన్మానం

కథలాపూర్: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ ఆదివారం సన్మానించారు. ఎన్నికల్లో బీసీల ఐక్యత చాటేందుకు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు రమేశ్ పేర్కొన్నారు. వేములవాడలో బీసీ బిడ్డ ఎమ్మెల్యేగా గెలవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలోనాయకులు వెలిచాల సత్యనారాయణ, దేశవేని చిన్నగంగారాం, బుర్ర వెంకటేశ్ పాల్గొన్నారు.

ధన్వంతరి ఆలయంలో సుదర్శన యాగం


సుదర్శన యాగంలో అర్చకులు, భక్తులు

జగిత్యాలటౌన్: కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా జగిత్యాల చింతకుంట చెరువు సమీపంలోని ధనలక్ష్మీ సహిత శ్రీధన్వంతరి దేవాలయంలో సుదర్శన యాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 21 కుండాలు, 63 జంటలతో 25 మంది వేద పండితులతో ఆదివారం భక్తి శ్రద్ధలతో యాగం నిర్వహించారు. యాగాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చిలుకముక్కు నాగరాజుశర్మ, విష్ణు శర్మ, విజయ్‌కుమార్, భాను ప్రకాష్, శరత్, వేణు, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలి


సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికులు

సారంగాపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పులి మల్లేశం అన్నారు. సారంగాపూర్‌లో మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చాలా ఏళ్లుగా పంచాయతీ కార్మికులకు చనిపోతే రైతు బీమా తరహాలో రూ. 5 లక్షల బీమా సౌకర్యం పంచాయతీ కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. ఆయన స్థానంలో ఆ కుటుంబానికి గ్రామపంచాయతీలో ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇటీవల మృతి చెందిన పోతారం పంపు ఆపరేటర్ జలేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే కార్మికులకు చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ఎవ్వసం కొండయ్య, దుబ్బయ్య, శాంతయ్య, పోసవ్వ, గంగమ్మ, నిర్మల, లక్ష్మీరాజం, రాజయ్య, లచ్చయ్య, చంద్రయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


ఆర్థిక సాయం చేస్తున్న నరేశ్‌రెడ్డి

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన ఆర్మూరి సునీత కుమారుడికి ప్రమాదంలో కాలు విరగగా, కొత్తపెల్లి తిమ్మయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా, బాధిత కుటుంబాలను తెలంగాణ గల్ఫ్ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి ఆదివారం పరామర్శించి ఇద్దరికీ రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. రాగుల నర్సయ్య అనారోగ్యంతో కోరుట్లలో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ తేలు నరేశ్, తేలు లక్ష్మినర్సయ్య, భాషా, బొమ్మ నరేశ్, హరీశ్ ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మల్యాల: మండలంలోని మ్యాడంపెల్లి గ్రామానికి చెందిన నిరుపేద గుర్రం లచ్చయ్య కుటుంబానికి మండల ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు దొంతరవేణి శేఖర్ చేయూతనందించారు. గుర్రం లచ్చయ్య పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఐదుగురు సంతానం కాగా, వారిలో ఇద్దరు అంగవైకల్యంతో బాధపడుతున్నారు. రోజు వారి కూలీతో జీవనం సాగిస్తున్నారు. వీరి దీనస్థితిని తెలుసుకున్న శేఖర్ స్పందించి వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.3వేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో గుర్రం లచ్చయ్య,నరేశ్, రవీందర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

మేరు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


మేరు సంఘం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా మేరు సంఘం నూతన కార్యవర్గం ద్రోణ కాలేజీలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాపర్తి వినోద్, ప్రధాన కార్యదర్శులుగా రామగిరి రమేశ్, మంతెన శ్రీనివాస్, గట్ల ఆనంద్, కోశాధికారిగా రాపర్తి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీరామరాజు, మాడిశెట్టి వినోద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గట్ల శ్రీనివాస్ సంఘం నర్సయ్య, దీకొండ స్వామి, గట్ల నారాయణస్వామి, వెన్న శేఖర్, రాయిళ్ల ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేరు సంఘం సభ్యులంతా ఐక్యతను చాటి, వారి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని మండలాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మ్యాంగో ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎండీ మొయిన్


గెలుపొందిన ఎండీ మొయిన్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లా మ్యాంగో ట్రేడర్స్ అండ్ కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎండీ మొయిన్ ఎన్నికయ్యారు. ఈ అసోసియేషన్‌కు ఆదివారం ఎన్నికలు జరుగగా, ఎండీ మొయిన్‌తో పాటు అమీన్ పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో ఎండీ మొయిన్‌కు 49 ఓట్లు రాగా, అమీన్‌కు 30 ఓట్లు వచ్చాయి. దీంతో 19 ఓట్లతో మొయిన్ గెలుపొందినట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు.

అంబారిపేటలో బోనాల జాతర


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో శ్రీ కేతేశ్వరస్వామి- కంకలమ్మ దేవి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో గ్రామం నుంచి దేవాలయం వరకు ఊరేగింపు తీసుకొచ్చి స్వామివార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల గంగరాజం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురిలో తీన్మార్ మల్లన్న టీం పూజలు

ధర్మపురి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతా సుభిక్షంగా ఉంటుందని తీన్మార్ మల్లన్న, టీం అధ్యక్షుడు రజిని అన్నారు. గోదావరిలో పూజలు చేసి తర్పణం వదిలారు. ఇక నుంచి ఏలాంటి భయం అవసరం లేదన్నారు. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆదరించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు.

అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష, అల్పాహారం

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప దీక్షా పరులకు మార్కండేయస్వామి ఆలయంలో భిక్ష , అల్పాహారం ఏర్పాటు చేసినట్లు గురుస్వామి శ్రీరాములు సత్యనారాయణ ఆదివారం తెలిపారు. దీక్షాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు ప్రారంభం

రాయికల్: మండలంలోని బోర్నపెల్లిలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆదివారం గ్రామంలోని వచ్చిన ఆర్టీసీ బస్సులో సేవలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు సత్యం, జలపతిరెడ్డి, రాహుల్, సుమన్, మధుకర్, రాజేశం,తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించటం హర్షనీయమని ఎంపీపీ తోట నారాయణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మహిళల ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం ఎక్కువ బస్సులు నడిపించాలని, అదే విధంగా నిరుపేదలైన మహిళలు ప్రయాణించేందుకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లే కాకుండా డీలక్స్, సెమీలక్షరీ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు.

బోరు వితరణ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో శ్మశానవాటిక వద్ద స్థానిక బీఆర్ఎస్ నేత గడ్డం భూమారెడ్డి సొంత ఖర్చులతో ఆదివారం బోరు బావి ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల తర్వాత స్నానానికి నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజల కష్టాలు తీర్చాలని సొంత ఖర్చులతో బోరు వేయించగా.. పుష్కలంగా నీళ్లు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. బోరు వేయించిన గడ్డం భూమారెడ్డిని స్థానికులు అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

12న జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థం పోటీలు

కోరుట్లటౌన్: గీతా జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా స్థాయి మద్భగవద్గీత కంఠస్తం పోటీలు ఈనెల 12న జగిత్యాలలోని గీతాభవనంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ మంచాల జగన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 6,7 ఒక విభాగం, 8,9 ఒక విభాగం కింద పోటీలు జరుగుతాయని తెలిపారు. పాఠశాలల యాజమాన్యం, హెచ్‌ఎంలు ఆసక్తి, ప్రతిభ ఉన్న విద్యార్థుల పేర్లు నమోదు చేయించాలని కోరారు. భగవద్గీతలోని 700 శ్లోకాలు వచ్చిన 18 సం.లోపు వారికి ఒక విభాగం, 18 సం.పైబడినవారికి ఒక విభాగంగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పేర్లు నమోదు కోసం 9441790725, 9885176157 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు బహుమతితోపాటు ప్రశాంసాపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, నాయకులు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో సీఎం రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు ఆదివారం నాయకులు, ప్రజలు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. టపాసులు కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ భైర హైమలత, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, ఎస్ఆర్ఐ భైర దేవ్‌యాదవ్, నాయకులు ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన మైనార్టీ నాయకులు


పొన్నంతో కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సోహైల్, షేక్ మహమ్మద్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పలు సమస్యలను ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి తీసుకపోయి పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసీ ఆగమయ్య ఆదివారం కోరారు. పాత పెన్షన్ విధానంతో పాటు నూతన పీఆర్సీ కోసం కమిటీ ఏర్పాటు, బదిలీలు, పదోన్నతుల వంటి సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్తీక వన భోజనాలు


వన భోజనాల్లో కిట్టి పార్టీ సభ్యులు

కోరుట్ల: పట్టణానికి చెందిన వినాయక కిట్టి పార్టీ సభ్యులు జగిత్యాల మండలం అంబారిపేట వెంకటేశ్వ ఆలయం సమీపంలో కార్తీక పూజలు నిర్వహించి వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో వినాయక కిట్టి పార్టీ ప్రతినిధులు అల్లాడి మహేశ్, రాజేందర్, ఉమా లక్ష్మీపతి, రమేశ్, అశోక్, నారాయణరాజు, ప్రవీణ్, అశోక్, పూర్ణచందర్, నారాయణ, రాజు, జగన్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన సుజిత్‌రావు


జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న సుజిత్‌రావు

కోరుట్ల: ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు జగిత్యాలలో కలిశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

కోరం లేక సమావేశం వాయిదా

కథలాపూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ జవ్వాజి రేవతి తెలిపారు. ఆదివారం సమావేశం ఉంటుందని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమాచారమిచ్చారు. కోరంకు సరిపడా ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రేవతి ప్రకటించారు.